క్లుప్తంగా

ఆర్ట్‌గ్యాలరీలో అవార్డుల ప్రదానం



విద్యార్థులకు అవార్డులను అందజేసిన సింగర్ సురేఖ తదితరులు

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో విజయ్‌ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులకు నిర్వహించిన కార్టూన్, పెయింటింగ్, ఎస్సే రైటింగ్ పోటీల్లో విజేతలకు ఆదివారం అవార్డులను అందజేశారు. కార్టూన్–52, పెయింటింగ్–138, ఎస్సే రైటింగ్–102 మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సింగర్ సురేఖ మాట్లాడారు. నిర్వాహకుడు విజయ్ కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

అత్యాధునిక పీఎఫ్‌టీ ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభించిన ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పవన్ తదితరులు

మాదాపూర్: దక్షిణ భారతదేశంలోనే అత్యాధునిక పల్మనరీ ఫంక్షన్ టెస్టింగ్ (పీఎఫ్‌టీ) ల్యాబ్‌ను మాదాపూర్‌లోని యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ హైటెక్‌సిటీలో ఆదివారం ప్రారంభించారు.కాగా మాదాపూర్ ఆస్పత్రిలో ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్షలపై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు ముగిసింది.ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన 500 మంది పల్మనాలజీ నిపుణులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పాదయాత్ర

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని కాలనీల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సోమవారం ఉదయం 8.30 గంటలకు ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1లోని హనుమాన్ ఆలయం నుంచి ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ పాదయాత్ర చేపట్టనున్నట్లు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం



మియాపూర్ : మియాపూర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీ మందాడి మగ్నూష్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మెడికేర్, యశోద ఆసుపత్రి వారి సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో కాలనీ, అపార్ట్‌మెంట్ వాసులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు, ఈసీజీ పరీక్షలు చేశారు. హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు సీపీఆర్ ఎలా చేయాలో చూపించారు. ప్రతి ఒక్కరూ వ్యాయామం, యోగా, నడక అలవాటు చేసుకోవాలన్నారు. అసోసియేషన్ సభ్యులు,కాలనీవాసులు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

మియాపూర్ : మియాపూర్‌లోని స్టాలిన్‌నగర్ కాలనీలో ఆదివారం కామ్రేడ్ స్టాలిన్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ హాజరై స్టాలిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టాలిన్ అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదంశెట్టి రమేష్ , రాష్ట్ర కమిటీ సభ్యులు భాగ్యమ్మ, రాణి, లక్ష్మీ, రాధ, ఈశ్వరమ్మ, నాగయ్య, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

టెండర్లు ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు బస్టాండ్‌లో వివిధ వ్యాపారాలు చేసుకోవడానికి ఖాళీగా ఉన్న దుకాణాలకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు హెచ్‌సీయూ డిపో మేనేజర్ శ్రీనివాసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...టెండర్ల ఆఖరు గడువు ఈ నెల 13వ తేదీతో ముగుస్తుందన్నారు. దుకాణాల ఖాళీల వివరాలు, నిర్వహించాల్సిన వ్యాపారాలు, ఈఎండీలను పట్టికలో తెలియజేశామన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ 9959226132లో సంప్రదించాలని కోరారు.

'కేవీ' కొనసాగాల్సిందే ..

- ఈ మూడేళ్లు విద్యార్థుల భవిష్యత్ నాశనం చేయొద్దు
- విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన
- ఒప్పంద గడువు ముగిసిందంటున్న హెచ్‌సీయూ
- ఆర్థిక భారమే ప్రధాన కారణం



హెచ్‌సీయూలో కేంద్రీయ విద్యాలయం కొనసాగే భవనం ఇదే..

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కొనసాగుతున్న కేంద్రీయ విద్యాలయ (కేవీ) భవిష్యత్‌పై నీలినీడలు అలుముకున్నాయి. ఒప్పంద గడువు ముగియడంతో ఇక మూసి వేయాలని హెచ్‌సీయూ ఆదేశాలిచ్చింది. దీంతో ప్రస్తుతం కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి ఏంటని వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. కేంద్రీయ విద్యాలయాన్ని హెచ్‌సీయూలో కొనసాగించాలని డిమాండ్ చేస్తూ శనివారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బీజేపీ నాయకులతో కలిసి హెచ్‌సీయూ ప్రధాన గేటు ఎదుట భారీ నిరసన కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే.

పదేళ్ల ఒప్పందంతోనే కేవీ ఏర్పాటు

- 2013–14లో పదేళ్లపాటు కొనసాగేలా హెచ్‌సీయూలో కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించారు.
- దీని నిర్వహణకు హెచ్‌సీయూపై ఏటా రెండు కోట్ల భారం పడినా భరిస్తోంది.
- ఇక ఆర్థిక భారం మోయలేమని, మూసి వేయాలని హెచ్‌సీయూ స్పష్టమైన ఆదేశాలిచ్చింది.
- క్రమక్రమంగా కింది తరగతుల అడ్మిషన్లు నిలిపివేస్తూ రావడంతో హెచ్‌సీయూలోని కేంద్రీయ విద్యాలయలో ప్రస్తుతం 7,8,9 తరగతుల విద్యార్థులు 240 మంది దాకా ఉన్నారు.



హెచ్‌సీయూలో కేంద్రీయ విద్యాలయను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ తల్లిదండ్రులతో కలిసి నిరసన తెలుపుతున్న విద్యార్థులు (ఫైల్)

బండి సంజయ్ లేఖ..

హెచ్‌సీయూలోని కేంద్రీయ విద్యాలయాన్ని మరో మూడేళ్లపాటు కొనసాగించాలని కోరుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు బండి సంజయ్ లేఖ రాశారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆ లేఖలో కోరారు. కేంద్రీయ విద్యాలయ రీజనల్ అధికారులను కలిసి విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు.

ఇవీ ప్రధాన డిమాండ్లు

- ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు పదోతరగతి పూర్తి చేసేవరకు ఇక్కడే కొనసాగించాలి.
- ఈ మూడేళ్లు కూడా హెచ్‌సీయూ క్యాంపస్‌లోనే ఈ విద్యాలయం ఉండాలి.
- కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలి–2గా మరో విద్యాలయానికి వేరే చోట స్థలం కేటాయించి, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన భవనం నిర్మించాలి. ఒకటో తరగతి నుంచి ప్లస్ టు వరకూ తరగతులు ఉండాలి.

పిల్లల భవిష్యత్‌ను కాపాడాలి



హెచ్‌సీయూలోని కేంద్రీయ విద్యాలయాన్ని కొనసాగించి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలి. చదువులు మధ్యలోనే ఆగిపోకుండా చూడాలి. ఇంకో మూడేళ్లు అయితే పదవ తరగతి వరకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.

–ఆర్ నర్సింహ, పేరెంట్

అర్ధంతరంగా అంటే ఎలా ?



అర్ధంతరంగా మూసివేస్తే విద్యార్థుల భవిష్యత్ ఏమిటి...? వచ్చే ఏడాది ఏ స్కూల్‌కు వెళ్లాలి. మధ్యలో వేరే సిలబస్ ఉన్న స్కూళ్లలో పిల్లలు చేరితే ఇబ్బందులు ఎదురవుతాయి. ఇంకో మూడేళ్లపాటు స్కూల్ కొనసాగించాలి.

–వినోద్, పేరెంట్

హెచ్‌సీయూలో కొనసాగించేలా చూస్తాం



కేంద్రీయ విద్యాలయాన్ని హెచ్‌సీయూలో కొనసాగించేలా చూస్తాం. బీజేపీ నేత రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో కలిసి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని కలిశాం. ఆయన కేంద్ర విద్యాశాఖ మంత్రికి లేఖ రాశారు. సేవ్ కేవీ కోర్ కమిటీ పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తాం.

–గంగాధర్‌రెడ్డి, కార్పొరేటర్, గచ్చిబౌలి

సీసీ రోడ్డు కోసం కార్పొరేటర్‌కు వినతి



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి టీమ్ అబోడ్ అపార్ట్‌మెంట్‌కు సీసీ రోడ్డు వేయాలని కోరుతూ అసోసియేషన్ ప్రతినిధులు కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌కు వినతిపత్రాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో టీమ్ అబోడ్ అసోసియేషన్ అధ్యక్షులు రవియాదవ్, ప్రతినిధులు గోపాల్‌యాదవ్, రాజేష్, వినోద్, రమేష్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

నటుడు పృథ్వీరాజ్‌కు అవార్డు అందజేత



పృథ్వీరాజ్‌కి అవార్డు అందజేసిన విశ్రాంత కలెక్టర్ లక్ష్మీకాంతం తదితరులు

మాదాపూర్: మాదాపూర్ అయ్యప్పసొసైటీలో నటుడు పృథ్వీరాజుకు కరోనా వారియర్ అవార్డును ఆదివారం విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో విశ్రాంత కలెక్టర్ లక్ష్మీకాంతం అందజేశారు. కరోనా సమయంలో ప్రజలకు చేసిన సేవలను గుర్తించి అవార్డు ఇచ్చినట్లు సంస్థ సీఈఓ సత్యవోలు రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ టీవీ సీఈఓ తోట రామకృష్ణ, విశ్వగురు సభ్యులు సెంట్రల్ సెన్సార్ బోర్డుమెంబర్ కృష్ణాది శేషు, యాదయ్యగౌడ్, ఇండో నేపాల్ అంబాసిడర్ సీహెచ్ రామతిలక్, హైకోర్టు అడ్వొకేట్ రవిచరణ్, విజయ్‌కుమార్, శిల్పారెడ్డి, లయన్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాలు

హఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్ ఆదిత్యనగర్‌లోని దర్గా వద్ద ఆదివారం నిర్వహించిన ఉర్సు ఉత్సవాలకు ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ హాజరయ్యారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, బాబుమియా, ఖాసీం, రహీం, లియాఖత్, సలీం, కాజా, సోహెల్, మునాఫ్, సాజిద్, అమీర్ పాల్గొన్నారు.

సిద్ధి వినాయక సేవలో..

హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియనగర్‌లో డాల్ఫిన్ ఎస్టేట్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కార్యసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరికెపూడి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నల్లా సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి

మియాపూర్ : అభివృద్ధి పనులను నిర్ణీత సమయానికి పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని సత్యనారాయణ ఎన్‌క్లేవ్ కాలనీలో రూ. 172.25 లక్షల వ్యయంతో చేపట్టిన నాలా విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. ప్రతి నాలా వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య ప్రదర్శన



శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం కూచిపూడి కళాకారిణి ప్రవాస భారతీయురాలు శార్వరి.. గజవదన బేడువే, రుక్మిణి ప్రవేశ దరువు, గోవర్ధన గిరిధర, వినాయకకౌతం, దశావతారం తదితర అంశాలను ప్రదర్శించింది. కళాకారులు షణ్ముఖి, కీసర, త్రిపుర సాయి, శ్రీశరనీ, కనిష్క, హిమబిందు, రితిక, నిహారికలు పాల్గొన్నారు.

- మాదాపూర్

ఘనంగా మల్లన్న జాతర



రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణం, జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ పుష్ప నగేశ్ ఆధ్వర్యంలో గంపలు ఎదుర్కొనే కార్యక్రమాన్ని నిర్వహించారు. పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయకుమార్, బూరుగడ్డ నగేశ్, ఆదర్శ్ రెడ్డి, ఐలేశ్ యాదవ్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జాతరలో బీఆర్‌ఎస్ నాయకులు నీలం ముదిరాజ్ ప్రత్యేక పూజలు చేశారు.మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, నాయకులు ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.



జాతర ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

వెలిమెలలో..

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, సుచరిత, మల్లెపల్లి సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్ల అన్ని దశలను ఆస్వాదిస్తూ ఎదగాలి



ప్రసంగిస్తున్న న్యాక్ డైరెక్టర్ శాంతిశ్రీ

మాదాపూర్: ప్రతి ఆడపిల్ల హాయిగా, ఆనందంగా అన్ని దశలను ఆస్వాదిస్తూ ఎదగాలని న్యాక్ డైరెక్టర్ శాంతిశ్రీ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని న్యాక్‌లో (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్)లో ఆదివారం మహిళ దినోత్సవంను నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ క్రైమ్ రేట్ ఎక్కడ తక్కువగా ఉంటుందో అక్కడ ఆడపిల్లలు ప్రశాంతంగా ఉంటారని తెలిపారు. మహిళలు ఎదిగేందుకు ప్రభుత్వం మరిన్ని అవకాశాలను, సబ్సిడీలను అందజేయాలని కోరారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన



ఆదిత్యనగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లిని ఆదర్శ, అగ్రగామిగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లో సుమారు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ఆదివారం తెల్లవారుజామున పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తి చేస్తామన్నారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, బాబు మియా, ఖాసీం, రహీం, లియకాత్, సలీం, కాజా, సోహెల్, మునాఫ్, సాజిద్ పాల్గొన్నారు.

అమీన్‌పూర్‌లో అభివృద్ధి పనులు వేగవంతం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో మసీదు, రామాలయం భూమిపూజకు ఆయన హాజరయ్యారు. అనంతరం 8వ వార్డు వెంకటరమణ కాలనీలో రూ.1.90 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, ప్రతి ఒక్కరూ పరమత సహనాన్ని పాటించాలన్నారు. ఒకప్పుడు బిందెడు నీళ్ల కోసం రోజుల తరబడి వేచి చూసే అమీన్‌పూర్ ప్రజలకు ప్రస్తుతం ప్రతిరోజూ మంచినీరు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.అనంతరం బీరంగూడ మండే మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీరంగూడ రజక సంఘం అధ్యక్షుడు మహేశ్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో యువకులు, మహిళలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్నారు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్‌కు చెందిన శుభం కుమార్(26) బతుకుదెరువు కోసం భార్యతో కలసి ఏడాది క్రితం అమీన్‌పూర్ పరిధిలోని బీఎస్ఆర్ కాలనీకి వచ్చాడు. ఆదివారం ఉదయం భార్య భవనంపైకి వెళ్లగా ఇంట్లో శుభం కుమార్ ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి బంధువు గణేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు పటాన్‌చెరుకు మంత్రి హరీశ్‌రావు రాక

పటాన్‌చెరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి సమావేశానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హాజరవుతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రితో పాటు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత లక్ష్మారెడ్డి, సంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మంజు శ్రీ జయపాల్ రెడ్డి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి తదితరులు హాజరవుతారన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



మాట్లాడుతున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకునేందుకు సీఎం కేసీఆర్ ప్రతి గ్రామంలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయించారని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. చిట్కుల్ గ్రామ పరిధిలో ఎన్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన డే అండ్ నైట్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...యువత దృష్టిని ఆటలపై మళ్లించేందుకు ఎన్ఎంఆర్ యువసేన క్రీడా పోటీలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. విజేత జట్టుకు రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు అంద చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మురళీ, వెంకటేశ్, రాజు కుమార్, రాములు, నారాయణ రెడ్డి, వెంకటేశ్, గోపాల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడతాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా పోరాటాలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు అన్నారు. ఆదివారం భారతీనగర్ డివిజన్ ఎల్ఐజీ కాలనీలో కిర్బీ పరిశ్రమ కార్మికుల వేతన ఒప్పందం పూర్తయిన సందర్భంగా నిర్వహించిన అభినందన సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు రాజయ్య, వాజిద్ అలీ, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం



పూజిత ఎన్‌క్లేవ్‌లో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

నిజాంపేట్: సంక్షేమ సంఘాలు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో బాచుపల్లి పూజిత ఎన్‌క్లేవ్ కాలనీలో ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో, కిమ్స్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ పూజిత కాలనీలో కిమ్స్ ఆస్పత్రి సహకారంతో 8 విభాగాల్లో వైద్య పరీక్షలు చేయడం శుభపరిణామమన్నారు. ఈ శిబిరంలో మొత్తం 500 మంది పరీక్షలు చేయించుకోగా వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్, ధూళిపాళ్ల రాజేష్ చౌదరి, కాలనీ అధ్యక్షులు సుధాకర్, శరత్ బీజేపీ , శ్రీధర్‌రెడ్డి, రమేష్, వాసు పాల్గొన్నారు.